

# అనగనగా... ఒక కథ

## అమ్మమ్మ

శ్రీనివాసరావు మాణిక్యమ్మ వైభవంగా కొడుకు పెళ్లి జరిపించారు. తమకి అన్నివిధాలా తగిన కోడలే దొరికింది. ఆడపిల్లవారు కూడా అనుకున్నట్లు అన్ని ఏర్పాట్లూ చేసి రెండు వర్గాల బంధువుల్నీ ఆనందపరిచారు. ఒకట్రెండు చోట్ల ఇబ్బందులొచ్చినా శ్రీనివాసరావు ముఖ్యంగా మాణిక్యమ్మ సర్దుకుపోవటానికి ఇష్టపడింది. "కరుణ రేపణ్నుంచి మనింట్లో కాపురం చేయాల్సిన అమ్మాయండీ- ఇవ్వాళ మనం నోరు చేసుకుని వాళ్లని చిన్నబుచ్చితే చుట్టాలు అందరూ సంతోషిస్తారేమోగానీ కోడలుపిల్ల దృష్టిలో మనం పేచీకోర్లుగా మిగిలిపోతాం- మనమూ ఆడపిల్లల పెళ్లిళ్లు చేయాల్సినవాళ్లం- మాట్లాడకుండా ఊరుకోండి" అని శ్రీనివాసరావుని చల్లార్చింది.

భార్య చెప్పిన మాటలకి శ్రీనివాసరావు సిగ్గుపడ్డాడు- ఒప్పుకున్నాడు. తలదించుకున్నాడు. ముప్పయ్యేళ్ల కాపురంలో ఎప్పుడూ నోరెత్తి సలహా చెప్పని మాణిక్యమ్మ ఇవ్వాళ అన్నమాటల్లో భుజం తడుముకోవలసిన మాటలు ఉన్నాయని అర్థం ధ్వనించింది.

☆ ☆ ☆

నిజమే!

శ్రీనివాసరావు పెళ్లి-

ప్రైవేట్ కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తున్న మాణిక్యం తండ్రి తనకున్నంతలో పెద్దకూతురు మాణిక్యం పెళ్లి చేస్తున్నాడు. వియ్యాలవారికి అంటే..శ్రీనివాసరావు తల్లిదండ్రులకీ వారివైపు బంధువులకీ మాణిక్యం తప్ప-వాళ్లు ఏర్పాటు చేసిన మర్యాదలు నచ్చలేదు.

సుముహూర్తం అవగానే పెళ్లితంతు ఎలాగో అయిందనిపించి పెళ్లివిందు కూడా అందుకోకుండా మాణిక్యాన్ని తీసుకుని వెళ్లిపోయారు. అసలు శ్రీనివాసరావు తల్లితండ్రులు మాణిక్యాన్ని కూడా దిగవిడిచే వెళ్లేవారేమోకానీ శ్రీనివాసరావు ఒప్పుకోలేదు- పెళ్లినాటి మర్యాదలు చాలక మాణిక్యం కుటుంబంతో శ్రీనివాసరావు కుటుంబం శాశ్వతంగా విడిపోయింది.

తండ్రి చనిపోయినా మాణిక్యం వెళ్లలేదు. కాదు..వెళ్లడానికి వీల్లేదు. మొగుడిశాసనం-

ఆ తర్వాత చాన్నాళ్లకి మాణిక్యం అత్తగారూ..ఇంకొన్నాళ్లకి మావగారూ పోయినా..మాణిక్యం తల్లికి కబురు వెళ్లలేదు. అది మొగుడి నిర్ణయం.

తల్లీతండ్రి పెట్టుకున్న పంతాలు శాశ్వతంగా వారసత్వంగా శ్రీనివాసరావు కొనసాగిస్తున్నాడు!

'మీ అమ్మా నాన్నా ఇప్పుడు లేరుగా- మా అమ్మని ఒకసారి చూసొద్దామండీ' అని మాణిక్యం అడగలేదు-అడగనూ లేదు.

**30** ఏళ్లు గడిచిపోయాయి.

పాతికేళ్లు దాటిన కొడుకు శశాంక్‌కి పెళ్లి చేస్తున్నారు, శ్రీనివాసరావు దంపతులు. "మనం ఇంకా ఇద్దరమ్మాయిలకి పెళ్లి చేయాలి. వాళ్ల చదువులు పూర్తవగానే పెళ్లి సంబంధాల వేట కొనసాగుతుంది. ఇప్పుడు మళ్లీ ఆడపెళ్లి వాళ్ల మీద విరుచుకుపడితే బాగోదు" భార్య మాట శ్రీనివాసరావుకి నిజమే-అనిపించలేదు కానీ..ఆమె చెప్పిన మాటకి మారుమాటాడకుండా 'అవును కదా' అనుకున్నాడు. మామూలుగా మారిపోయాడు-సర్దుకు పోవాలనుకున్నాడు.

☆ ☆ ☆

దంపతులిద్దర్నీ హనీమూన్‌కెళ్లమని **15** వేలు సేంక్షన్ చేశాడు శ్రీనివాసరావు. కొడుకు కోడల్ని పక్కకి పిల్చింది మాణిక్యం.

"నాకో చిన్నకోరిక ఉందర్రా తీరుస్తారా?" అంది గద్గదంగా.

"చెప్పు-అమ్మా"

మాణిక్యం మాట కొంతసేపు పెగల్లేదు-

"చెప్పండి అత్తయ్యా" కోడలు ప్రేమగా అడిగింది.

"మీరు హనీమూన్‌కి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేముందు అయినా మీ అమ్మమ్మ దగ్గరికి వెళ్లార్రా! ఆవిడ ఆశీర్వాదం తీసుకోవాలి"

ఇద్దరూ కన్నీళ్లతో చెప్తున్న ఆమె మాటల్ని వింటున్నారు.

"అత్తయ్యా..మీ అమ్మగారు పెళ్లికి రాలేదా?" కొత్తకోడలు ఆత్మీయంగా అడిగింది.

"రాలేదమ్మా! మేము పిలవలేదు"

"రాలేని స్థితిలో ఉందా అమ్మమ్మ?"

"కాదు..నేను పిలవలేని స్థితిలో ఉన్నానా" కళ్లనీళ్లు పొంగి గొంతులో దుఃఖం రాయి గట్టింది.

"కాకినాడ దగ్గర సర్పవరంలోనే ఉంటోందిట- మా నాన్న పేరు కొండపూడి పరమేశ్వరం-ఆయన లేరు. అమ్మని బుల్లమ్మాయి అనేవారు. అసలు పేరు సీతామాలక్ష్మి"

ఇంకా వివరాలు చెప్పేలోగా..ఎవరో రావటం వల్ల ఎడ్రస్సు తనకి తెల్సున్నంతలోనే చెప్పగలిగింది.

కొత్తకోడలు వాసంతికి అత్తగారి మాతృప్రేమ మీద అమితమైన ఆదరణ కలిగింది.

ముందు ఆ మామ్మగారి దగ్గరికే వెళ్దామని భర్తని కోరింది.

ఆలుమగలు హనీమూన్..'అన్నవరం' అని డిక్లేర్ చేసి బైల్దేరారు.

☆ ☆ ☆

"సర్పారం ఎల్లాంటే బొస్సులుంటాయండి- ఎందుకండి ఆటో కుదురిత్తా- ఎల్లిపొండి-రిచ్చాలో మీరు కూకోలేరు..నేను లాగలేను" రిక్షావాడ్ని అడిగితే నిజాయితీగా చెప్పాడు.

"సర్పారం ఏడకెళ్లాలండి" ఆటోవాడు అడిగాడు.

"చూద్దాంపోనీ..పెద్ద వూరా?"

"పెద్ద వూరంటే..పెద్దదే. గుడికెళ్లే భక్తులు ఈణ్నించే ఆటోలెక్కి వెళ్లారు-మడిసికి ముప్పై రూపాయలు తీసుకుంటాం-గుడికాణ్నించి ఊళ్లోకెళ్లాలంటే..రేటు మారుద్ది" అన్నాడు ఆటోవాడు.

"సరే గుడి దగ్గరికి పోనియ్"

ఆలస్యం చెయ్యకుండా ఎక్కేసారు శశాంక్-వాసంతి.

ఇన్నాళ్లుగా అమ్మమ్మ మాట ఎప్పుడూ వినలేదు శశాంక్.

ఆవిడ పేరు సీతామాలక్ష్మి...ఏదో ముద్దుపేరుతో పిలిచేవారుట!

ఆ పేరు ఏంటి..గుర్తురావట్లేదు- 'సర్లే వెళ్లేలోగా గుర్తొస్తుంది' అనుకున్నారు.

'అయినా ముసలావిడకి ముద్దుపేరు ఏంటిలే- సీతామాలక్ష్మి పేరు గుర్తుంది కదా' అనుకున్నారు.

సర్పవరం గుడిముందు ఆటో ఆగింది.

దైవదర్శనం చేసుకున్నారు.

సీతామాలక్ష్మిగారి ఇంటికి వెళ్లాలి! గుడి బైటకొచ్చి ఒక భక్తుణ్ని అడిగారు.

ఒక రిక్షావాణ్ని అడిగారు. అతనూ తెలియదన్నాడు. చాలామందిని అడిగారు. ఎవరూ సీతామాలక్ష్మిగారు ఎవరో తెలీదన్నారు. ఆఖరికి ఒక వ్యక్తి "బుల్లెమ్మగారి వీధికెళ్లండి- ఆడ పోస్టాఫీసు వుంటుంది. అళ్లనడుగుతే సెప్తారు"

"ఏవండీ నేనెళ్లాల్సినది బుల్లెమ్మగారింటికే" అరిచినట్లు అన్నాడు శశాంక్.

"మరా ముక్క ముందే సెప్పచ్చుగా" రిక్షావాళ్లంతా ముక్తకంఠంతో అరిచినట్లు అన్నారు.

అందరూ నేను తీసికెళ్తానంటే..నేను తీసుకెళ్తానని పోటీపడ్డారు.

"ఎంతివ్వాలి" అంది గడుసుగా వాసంతి.

"దబ్బులొద్దొమ్మా ఎక్కండి- బుల్లెమ్మగారి ఇంటికి

ఎల్లాలాంటే..బుజాలమీద ఎక్కించుకుతీసుకుపోతాం- ఆ మా తల్లి మా వురి దేవత- మా అందరికీ వొణ్ణం పెట్టిన మహాదాత" కొయ్యబారిపోయి రిక్షా ఎక్కారు దంపతులు.

"ఆయమ్మగారింటికి ఏ పనిమీద ఎల్తున్నా రండీ" మాటలు కలిపాడు రిక్షావాడు.

చెబ్దామావద్దా అని తటపటాయిస్తున్నాడు శశాంక్.

"అది కాదయ్యా-బుల్లెమ్మగారి పేరు విన గానే నువ్వంత భక్తిగా ప్రేమగా పలకరించావు- ఆవిడ ఏం చేస్తుందనలు" వాసంతి అన్నమాట లకి రిక్షా డ్రైవరు బ్రేకేసి, దిగి.."ఆయమ్మ మావూరి దేవత- ఇక్కడ నాలాంటోల్లు ఇంత అన్నం తింటన్నారంటే ఆయమ్మ సలవేనమ్మా- ఒక్కగానొక్క కూతురు మాణిక్యమ్మ అనే యావిడుండేది- పెళ్లి చేసుకుని మళ్లీ ఈయ మ్మవైపు కన్నెత్తి సూళ్లేదు. ఏదుందో తెలి యలేదు. ఈయమ్మ మొగుడు పోయి నాక..ఆయన అస్తి ఏం చేయాలో తెలీక..ఊళ్లో నలుగురు పెద్దల్నీ పోగేసింది. అళ్లనడిగి పేదోళ్లెవరో ఎంచుకుంది. పిల్లల్లేనమ్మలా ఉన్నదంతా పేదోళ్లకి ఇచ్చే సింది. ఈణ్ణుంచి కాకి నాద-కాకినాదేంటి మా జిల్లా అంతా ఆవిడకి దణ్ణం ఎట్టి ఎల్తారు. డొక్కా సీతమ్మ గారి బుల్లి సెల్లాయి అను కోండి మా బుల్లెమ్మగారు" అని మళ్లీ రిక్షా ఎక్కాడు అతను.

"డొక్కా సీతమ్మగారు ఎవరండీ" రహస్యంగా అడి గింది వాసంతి. సైలెంట్‌గా పెదవి విరుస్తూ తెలీదన్నట్లు తలాడించాడు శశాంక్.

రిక్షా బుల్లెమ్మగారి ఇంటి ముందు ఆగింది..తాటాకుల్తో నేసిన పాకలో అరవై ఏళ్లు దాటిన బుల్లమ్మాయి చాలా ఆరోగ్యంగా ఆనందంగా వుంది- అమ్మమ్మ అని కాదు గానీ చూడగానే దణ్ణం పెట్టాలనిపించింది.

"ఎవరుబాబూ మీరు"

"నా పేరు శశాంక్..ఈమె వాసంతి"

"కొత్తగా పెళ్లైనట్లుంది..ఎక్కడుంటారు"

"హైదరాబాద్"

"గుడికొచ్చారా..మా దేవుడికి మొక్కుకుంటే బంగారం లాంటి పిల్లలు పుడతారు"

"గుడికి ఇంకా వెళ్లలేదు-ముందు నీ ఆశీర్వాదం తీసు కుందామని వచ్చాం..అమ్మమ్మా-"

"ఈ పిలుపు కొత్తగావుంది- మావూళ్లో అందరూ బావమ్మగా రనో బుల్లెమ్మ గారనో అంటార్లే-అమ్మమ్మ అనరు" నవ్వుతూ అంది.

దణ్ణం పెట్టారు ఇద్దరూ. మనస్ఫూర్తిగా ఆశీర్వదిం చింది. అరుగుమీద కూచోపెట్టుకుంది-

"నేను మాణిక్యమ్మ కొడుకుని" ఆవిడ ముఖం ఆశ్చ ర్యంగా మారింది. "నేను మీ మనవణ్ణి" పరిశీలనగా చూస్తోంది.

"మా పెళ్లవగానే అమ్మ నీకు దణ్ణం పెట్టిరమ్మంటే వచ్చాను"

ఆవిడ కళ్లలో నీళ్లు తిరిగాయి- కళ్లు తుడుచుకుంటూ..

"ఒరే..నా కళ్లలో నీళ్లొచ్చి చాలా ఏళ్లయింది- కన్నీళ్లు తుడవడమే తప్ప కళ్లనీళ్లు పెట్టకూడదనుకున్నాను. మిమ్మల్ని చూస్తే పాత బుల్లమ్మ అయిపోతున్నాను. త్వరగా వెళ్లి పోండిరా..మీరు ఉంటే నాలో స్వార్థం నా అన్నవాళ్లున్నారన్న మమకారం పెరిగిపోతుంది. ఆ మమకారం ఇలా కన్నీళ్లలో ముంచేస్తుంది. వెళ్లండి..మీ అమ్మకి మాత్రం నన్ను చూశానని చెప్పకండి! దానికీ లేని పోని బెంగ పెరుగుతుంది. వెళ్లిపోండి" అటెళ్తున్న రిక్షాని పిలిచి "ఒరే- అన్నారం వీళ్లని వెంకటేశం బట్టల దుకాణా నికి తీసుకెళ్లు- అబ్బాయికీ, అమ్మాయిగారికీ నచ్చిన జత ఇమ్మను-సాయంత్రం వచ్చి సొమ్ములు తీసుకోమను"

"ఏమీ అనుకోకండ్రా..నేను ప్రేమ పంచడమే తప్ప ప్రేమ పొందలేను"

హాయిగా నవ్వుతూ సాగనంపింది.

అమ్మమ్మని అనవసరంగా చూసామా అనుకు న్నాడు-కానీ వెంటనే కాదు..ఆలస్యంగా కలిసాం-అనుకు న్నాడు-

బరువెక్కిన గుండెల్తో రిక్షా ఎక్కారు.

వెనక్కి తిరిగి చూస్తే అమ్మమ్మ లోపలికెళ్లిపోతోంది, ప్రేమని జయించిన విరాగిలా.

☆

